# కనకారావుకి స్పృహతప్పింది

## (కోవి రామమోహన శాస్త్రి)



ఆసలు కనకారావుకి నాకూ ఎప్పుడూ చుక్కెదురే. ఈ భూమ్మీద మహా నికృష్టంగా బతుకుతున్న నర కీటకాలను ఉద్ధరించేందుకు వాడేదో మహా ... లోకాన్నుంచి దిగొచ్చిన ... యిధావిలా పోజు కొడుతు... ఒళ్ళంతా భగభగా మండిపోతూ వుంటుంది. అందులోనూ వాడో రచయిత. ఆదిలో నాటక రచనతో శ్రీకారం చుట్టేడు. క్రమంగా కధలూ గట్రా, తదనంతరం నవలికలూ, నవల్సూ పుంఖాను పుంఖాలుగా రాసి పారేస్తున్నాడు. ఆమధ్య 'శోచనీయ స్థితిలో ఆధునిక నాటక రంగం' అనే గ్రంధమేదో రాసేట్ట.

నిజమేనండీ! ఇదంతా పచ్చి నిజం. కాదన్ను. అందులోనూ కనకారావు నాకు బాల్య మిత్రుడు. వాడు గొప్పవాడైతే పొంగిపోయే అర్భకుల్లో నేను మొదటివాణ్ణి. అయితే వచ్చిన చిక్కల్లా వాడి పోజుతోనే! మాటకి ముందు సామాజిక స్పృహ అంటాడు. ఆఖరికి మొగుడూ పెళ్ళాలు కాపరం చెయ్యటంలో కూడా ఆ స్పృహే వుండాలని బల్లగుద్ది చెపుతూ వుంటాడు. సదరు సామాజిక స్పృహ గురించి మా కనకారావు మాట్లాడ్డం మొదలెడితే – నా సంగతి వదిలేస్తే - కాస్త బిక్క గుండెల వాళ్ళకి ఖాయంగా స్పృహ తప్పుతుంది. వాడి ఉపన్యాస ఝుంఝామారుతంలో చిక్కుకుని నేనూ స్పృహ తప్పి పడిపోవటానికి సిద్ధమైన సంఘటనలు లేకపోలేదు. అప్పుడప్పుడు ఈ మహా కష్టంలోంచి ఎక్కడికేనా పారిపోవాలని తపించిపోయేవాణ్ణి. కాని నాతరం కాలేదు. కారణం మా అనుబంధం అటువంటిది. ముందే చెప్పాను. వాడు రచయిత అని. నా కర్మ కాలి నేనో పేరు పడ్డ నటుడ్ని. పది పదిహేను పెద్ద కప్పులూ, డజన్లర పైచిలుకు షీల్డులూ, రెండు పుంజీల సన్మానాలూ సంపాదించుకున్నవాణ్ణి. దాంతో పరిషత్తు పోటీల నిర్వాహకులు మమ్మల్నిద్దర్నీ జంటగా జడ్జీలుగా ఆహ్వానించేవాళ్ళు. ఈ రకంగా నేను మా కనకారావు పాలబడిపోతుండేవాణ్ణి.

ఆసలిదంతా తమకి మనవి చేసుకుంటున్న సందర్భం బెట్టి దనిన:-

ఆరోజు ఆదివారం. ఉదయం ఎనిమిది దాటింది. కాఫీ గట్రా ముగించి ముందు గదిలో కూచుని పేపరు తిరగేస్తున్నా. అంతలో వచ్చేడు మా కనకారావు.

"ఉన్నపుట్రా రావుడూ! ఉండవేమో అని కంగారు పడుతూ పరిగెట్టుకొచ్చేను" అన్నాడు కనకారావు నా ఎదురుగా పడక్కుర్చీలో తన భారీ కాయాన్ని కూలేస్తూ ... లేస్తూ పరిగెత్తుకు...

"అంత ... కపోతేనేం? అన్నాను పేపరు ముడిచేస్తూ.

"ఏడిశావులే!" అని నవ్వి, "రాత్రి ఓ కధ రాసేను" అన్నాడు ఎటో చూస్తూ.

"ఆహా!" అన్నాను.

"నీకు వినిపిస్తేగాని తోచి చావదుగా నాకు!"

"అవునవును!"

ఓ సిగరెట్టు ముట్టించి గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలేను.

"చదువు!" అన్నాను.

కనకారావు చేతిలో వున్న కాగితాల మడతలు విప్పుతూ, అల్లా ఆ వెధవ పోజొకటి నా మీదికి సంధించేడు.

"ఆవకాయ గురించి రాసేను" అన్నాడు.

"అల్లప్పచ్చడి గురించి రాయాల్సిందిరా! అదంటే నాకు చాలా యిష్టం!" అన్నాను.

కనకారావు చాలా సీరియస్‌గా చూసేడు. నే నాట్టే పట్టించుకోలేదు. ఆ పోజులు నాకు బాగా అలవాటైపోయేయి మరి. అందుకే నా ధోరణిలో నేను, "నాకు చాలా సంతోషంగా వుందిరా కనకా! అగ్గిపుల్లా, సబ్బుబిళ్ళా, కుక్కపిల్లా కాదేదీ కవిత కనర్హం-అన్నాడు శ్రీశ్రీ. అలాగే ఆవకాయా, మాగాయా, అల్లప్పచ్చడీ, విశాఖపట్నం హోటళ్ళలో పోసే చారులాంటి చట్నీ - ఇవన్నీ కధలకి అర్హమే! వీటన్నింటిమీదా కధ్రాయొచ్చు. అచ్చేసే పత్రికలూ వుండొచ్చు. రాసిన నీలాంటి వాళ్ళకి పేరూ ప్రతిష్ఠ రావొచ్చు. కాదన్ను. ఆసలింతకీ నువ్వు ఆవకాయమీద కధ రాసి నాలాంటి అల్ప ప్రాణులకి ఏం చెప్పదల్చుకున్నావ్?" అనడిగేను.

కనకారావు నన్నో అత్యల్పుణ్ణి చూసినట్టు చూసి, "ఆధునిక ఆర్థిక సూత్రాలు వంటబట్టక త్రిశంకు సంతతిగా పేరుపడ్డ మధ్య తరగతి ప్రజానీకం ఆవకాయ, మాగాయల్లాంటి ఊరగాయలు పెట్టుకోడంకోసం, ఆవెధవ ఆడంబరం కోసం అప్పులు చేసి నాశనమై పోతున్నారు. మనశ్శాంతి పోగొట్టుకుంటున్నారు. అలాంటి వాళ్ళకి కనువిప్పు కలిగించటం కోసమే కంకణం కట్టుకుని ఈ కధ రాసేను" అన్నాడు గంభీరంగా.

చటుక్కున వాడి రెండు చేతులూ పట్టుకుని, "ఓహో! ఆవకాయపెట్టుకోడానికి, ఆర్థిక సూత్రాలకి ముడి పెట్టగలిగేంత సామాజిక స్పృహ నీలో వున్నందుకు చాలా గర్వంగా వుందిరా!" అన్నాను

అంతకంటే గంభీరంగా.

కనకారావు నా కాంప్లిమెంటుకు పొంగిపోయిన సూచనగా పకపక నవ్వేడు.

"ఇహ విన్రా కథ!" అని చదవడం మొదలెట్టేడు.

టూకిగా ఆ కథ సారాంశం యిది.

–ఓ మధ్య తరగతి వాడుంటాడు. వాడి జీతం వాడికెప్పుడూ చాల్దు. ఎందుకంటే ముగ్గురు పిల్లలూ, ముసలి తల్లి దండ్రులూ, రోగిష్టి పెళ్ళాం. అద్దె యిల్లూ అడపాదడపా అక్కడా యిక్కడా చేసిన చిల్లర మల్లర అప్పులన్నీ కలిసి మోపైన బండెడు వడ్డీల బరువూ- వీటన్నింటితో మనిషి కుంగిపోయేడు. అయినాసరే వాడికి ఈ షణ్మాత్రం తెలివి రాలేదు. పరువూ, ప్రతిష్ఠా పీఢినబడిపోతున్నా సరే పాత పద్ధతులు మార్చుకుందామన్న బుద్ధి లేకుండా సీజనొచ్చేసరికి ఆవకాయలూ, మాగాయలూ పెట్టుకుందుకు వందలకి వందలు అప్పులు చేసేడు. అవన్నీ తీర్చలేక నానా అవస్థలూ పడసాగేడు. చివరికి అప్పులాళ్ళందరూ కోర్టికెక్కేరు. కోర్టువారు వాడి జీతంలోంచి ఇన్‌స్టాల్‌మెంటుల్లో బాకీలు తీరే ఏర్పాటు కల్పిస్తూ తీర్పు చెప్పేరు ఓ రోజు. పూర్తిగా ఓడిపోయి దీనె మొహంతో యింటికి తిరిగొచ్చే భర్త మొహం చూడ్డం యిష్టంలేక వాడి పెళ్ళాం ఉరేసుకు చచ్చింది. ఈ నష్ట జాతకుడు ఆవిడగారి శవంమీదపడి, "ఊరగాయల అప్పుల కోసం నిన్ను బలి పెట్టిన ఈ నీచుణ్ని క్షమించొద్దు తాయారూ!" అని బావురుమని ఏడ్చేడు–ఇదీ కనకారావు రాసిన కథ.

"ఎలా వుందిరా రావ్‌డూ?" అనడిగేడు మా కనకారావు కాగితాలు మడతలు పెడుతూ.

"దెయ్యిం తిరిగిన నువ్వు రాసిన కథని కాదనడానికి- గ్గాని, అవుననడానిగ్గాని నాకున్న రెపొంటి ఏవిట్రా? ఏదో అభిమానం కొద్దీ అడుగుతున్నావు గాని!" అన్నాను. ఆ మాటలు వాడి ఇగోని ఎంతగా సంతృప్తి పెట్టేయో వాడి మొహం చూడగానే బోధపడింది నాకు. వాడు ఆ తృప్తితోనే మా ఆవిడిచ్చిన కాఫీ తాగేసి తన కాయాన్ని దొర్లించుకుపోయేడు.

కనకారావు అలా గుమ్మం దాటీ దాటగానే "ఏవిటండీ ఆ కథ? నా బొందలా వుంది. ఆవకాయ కోసం కోర్టుల కెళ్ళేంత ఘోరమైన అప్పులు చెయ్యడం, ఆ అభాగ్యుడి పెళ్ళాం ఉరిపోసుకు చావడం. ఇదా కథ? ఆ అప్పులకి, ఆ పెళ్ళాం చావుకీ ఆవకాయ కోసం చేసిన అప్పే దొరికిందా? రాసేవాడికి బుద్ధి లేకపోతే వినేవాడికన్నా బుద్ధుండాలి. పైగా ఏవిటలా భట్రాజులా పొగిడేస్తున్నారు?" అంటూ ఎడా పెడా వాయించొదిలేసింది మా ఆవిడ నన్ను.

"నీకూ నాకూ అంతరార్థాలు బోధపడనంత- మాత్రాన వాడి కొచ్చిన నష్టమేమిటే పిచ్చి మొహమా! కనకం గొప్ప రచయిత. వాడేది రాసినా అందులో గొప్ప స్పృహ వుంటుందిట! కనకనే కొన్ని మహా నగరాలనించి వెలువడే పెద్ద పత్రికలు వాడి కథో, కాకరకాయో లేకండా ఫైటపడ్డం లేదు. వాడి స్పృహని గుర్తించే చాలా నాటక కళా పరిషత్తులు పదేపదే వాణ్ని న్యాయ నిర్ణేతగా పిల్చి గౌరవించి తరిస్తున్నారు." అన్నాను సీరియస్‌గా. మా ఆవిడ ఆముదం తాగినట్టు మొహం పెట్టి, కాళీ కప్పులందుకుని లోపలికి వెళ్ళిపోయింది.

రైలు నడవడం లేదన్న అనుమానం వచ్చి చదువుతున్న పుస్తకం మూసేను. ఎదురుగా కూచున్న కనకారావు మొహంలోకి చూసేను.

"పావు గంటై యిక్కడే పడుందిరా, రావ్‌డూ రైలు! చూస్తే ఇది ఎక్స్‌ప్రెస్ ఆగాల్సిన స్టేషను కాదు!" అన్నాడు కనకారావు.

"క్రాసింగేమో!" అంటూ వాచీ చూసుకున్నాను. రాత్రి తొమ్మిది దాటింది. పుస్తకం పక్కన పడేసి కంపార్ట్‌మెంటు గుమ్మం దగ్గరికి నడిచేను. కొద్ది దూరాన ప్లాట్‌ఫారంమీద, గోపికల మధ్యన శ్రీకృష్ణుడిలా స్టేషన్ మాష్టరు ప్రయాణికుల గుంపులో చిక్కుకుపోయున్నాడు. కిందికి దిగి గుంపుని సమీపించేను. సన్నగా వాన చినుకులు పడుతున్నయి. విషయం వినగానే నా గుండె ఆగినంత పనైంది. మా రైలాగివున్న స్టేషన్‌కీ, పై స్టేషన్‌కీ మధ్య లైను ఏటి నీటిలో మునిగిపోయిందట. పట్టాలమీద అడుగెత్తు నీరు పారుతోందట. ఏరు తగ్గేదాకా రైలు కదిలే అవకాశం లేదట. ఇది ఆ కృష్ణమూర్తిగారు చెప్పిన భోగట్టా. అది విన్న తక్షణం నాకు మా కనకంగాడిమీద విపరీతమైన కోపం వచ్చింది. ఈ ప్రయాణం వద్దురా కనకా అని శత పోరు పెట్టేను. విని ఛావలేదు వెధవ. ప్రతిసారి ఆ పరిషత్తు వాళ్ళు పదేపదే మనల్నే న్యాయ నిర్ణేతలుగా పిలుస్తున్నారు. వెళ్ళకపోతే బావుండదని పట్టుబట్టేడు. పైగా వాళ్ళ భోజనం ఏర్పాట్లవీ చాలా గొప్పగా వుంటాయని లొట్టలేసేడు. వద్దు మొర్రో అంటున్నా వినకండా బయలుదేరదీసేడు.

ఇప్పుడీ చీకట్లో, వర్షంలో, ఏమీ దొరక ఈ కుగ్రామంలో ఈ రాత్రి రైల్వే కంపార్ట్‌మెంటులో గడపడం ఎలా? ఇది నాలో సమాధానం లేని ప్రశ్న.

వర్షం పెద్దదైంది. గబ-గబ కంపార్ట్‌మెంటులో వచ్చి పడ్డాను. పరధ్యానంగా చూస్తున్న కనకంగాడి



చెవినేశాను విషయం.

వాడి మొహం మసి బొగ్గులా తయారైంది.

"ఇంకో రెండు గంటల్లో గమ్యం చేరేవాళ్ళం. మధ్యలో ఈ అడ్డంకేవిట్రా? పాపం వాళ్ళక్కడ ఎ. సి. రూం బుక్ చేసి, భోజనాల ఏర్పాట్లు చేసుంటారు. బంగారంలాంటి సుఖం కాస్తా ఈ రైలు పెట్టిలో కరిగి పోవలసిందేనా?" అని వాపోయేడు కనకారావు. .

"తప్పదురా తండ్రి! నీ కక్కుర్తికి ఇలాంటి శాస్తి ఎప్పుడో అప్పుడు జరగాల్సిందేలే! అప్పుడుగాని నీకు బుద్ధి రాదు!" అన్నాను కసిగా.

"బుద్ధి సంగతేమో గాని, చచ్చేటంత ఆకలేస్తోందిరా! తినటానికి ఇక్కడేవన్నా దొరుకుతుందో లేదో!" అన్నాడు.

"దొరుకుతాయట!" అన్నాను.

"ఏవిటి?" అడిగేడు కనకారావు.

"కావలసినన్ని ఆకులూ, అలములూ! ఫ్రీగా మనిష్టం వచ్చినట్లు తినొచ్చు!" అన్నాను ఎటో చూస్తూ.

కనకారావుకి కంగారు పుట్టింది. పెట్టిలోంచి దిగి ప్లాట్‌ఫాం మీదికి వెళ్ళేడు. పది నిముషాల తరవాత తిరిగొచ్చి "తెల్లారేదాకా రైలు కదిలే ఆశ లేదురా రావుడూ! ఉన్న ఆశల్లా ఒకటే! ఇక్కడికి మూడు మైళ్ళలో మన మిత్రుడు సుబ్బరామయ్యగాడుండే వూరుంది. అక్కడేగదా వాడు మాష్టరుగిరి వెలగబెట్టేది! ఓపిక చేసుకుని ఓ గంట నడిస్తే అక్కడికి చేరగలం! రాకరాక వచ్చిన వాళ్ళంగదాని దయ తల్చి వాడు నాలుగు మెతుకులు పడేస్తే ఆత్మారాముడు చల్లబడతాడు లేకపోతే ఈ వయసులో ఆకలిబాధ తట్టుకోవడం కష్టం సుమీ!" అన్నాడు.

"ఈ చీకట్లో దారేం తెలుస్తుందిరా మనకి? పైగా వర్షంలో, బురదలో నడువగలమా అని! మనం పల్లెటూరి వెధవలమే అయినా పట్నం చేరి పాతికేళ్ళయింది. కాలు తీసి కాలు పెట్టగలమా అని!" అన్నాను.

"ఆ వూరి రైతు లిద్దరు కనిపించి, ఇష్టమైతే వెంట

# కనకారావుకి స్పృహ తప్పింది

తీసుకుపోతామంటున్నారు. మన సుబ్బరాయుడికి బాగా తెలిసినవాళ్ళే!" అన్నాడు కనకారావు.

"తెల్లారేసరికి రైలుకి అందుకోగలమంటావా?" సందేహం బైట పెట్టాను.

"రైలు కాకపోతే బస్సు! ఖర్చులు వాళ్ళవేగదట్రా! మన ఖర్చులైతే బాధ పడాలిగాని!" అన్నాడు కనకారావు.

ఆలోచించేను. ఇంతకంటే మరో దారి లేదు. మరో అయిదు నిముషాల్లో ఎయిరు బ్యాగులు బుజానేసుకుని దేవుళ్ళల్లే కనిపించిన రైతుల వెనకాల సీతంపాలెం రోడ్డుమీద బురదలో పాదయాత్ర ప్రారంభించేం.

చచ్చి చెడి రాత్రి పదిన్నరకి సీతంపాలెం చేరి సుబ్బిగాడి యింటి తలుపులు తట్టేం. తలుపులు తెరిచి, రెండు క్షణాలు మా యిద్దర్ని తేరిపార చూసిన అనంతరం సుబ్బరామయ్య మొహంలో వెయ్యి మతాబాలు వెలిగేయి. వాడి కళ్ళు రెండూ కల్హార సరస్సులే అయ్యేయి.

నా ముట్టుకు నాకు సుబ్బిగాడి విశాల నేత్రాలంటే మహా యిష్టం. వాడి కిష్టం లేదని వదిలేశాను గాని అసలు వాడి అంద చందాలకి వాడి నో మహా నటుణ్ణి చెయ్యాలని వెంపర్లాడిపోయేవాణ్ణి. కాని నాకూ, వాడికీ ఆ యోగం లేకపోయింది.

"ఎంత అదృష్టవంతుణ్ణిరా నేస్తాలూ! మీ యిద్దరూ రెండు రంగాల్లో ఉద్దండులు. లబ్ధ ప్రతిష్ఠులు. మీ రాకతో ఈ దీనుడి యిల్లు పావనమై పోయిందిరా! రండి! రండి!" గద్గద స్వరంతో అంటూ మమ్మల్ని కావలించుకున్నాడు. సాదరంగా లోపలికి తీసుకుపోయి కూర్చొబెట్టేడు.

మే మక్కడికి చేరటానికి వెనకున్న కథ విని "ఆ పొంగిన ఏరుకీ, ఆగిపోయిన మీ రైలుకీ జీవితాంతం ఋణపడి వుంటాన్రా నేను. ఆ రకంగానైనా నేను గుర్తొచ్చేను మీకు" అన్నాడు.

వాడి భార్య సుందరమ్మ చాలా కలుపుగోలు మనిషి. కుశల ప్రశ్నల అనంతరం వంట ప్రయత్నం చేస్తానంటూ లోపలికి వెళ్ళింది. సుబ్బరామయ్య కూడా "ఇప్పుడే వస్తాన్రా" అంటూ భార్య వెనకే వెళ్ళేడు. లోపల్నుంచి వాళ్ళ సంభాషణ మా చెవుల్లో పడింది.

"ఏం దారండీ! ఒక్క కూరన్నా లేదు. పచ్చడి మెతుకులతో ఎలా వడ్డించమంటారు?" అన్నది సుందరమ్మ. "నా బాధ అదేనే! చేతిలో చిల్లి గవ్వ లేదు. పైగా రాత్రి పదకొండవుతోంది. పోనీ సెట్టిగార్ని లేపుదామా అంటే అప్పటికే ఆయనకి బోలెడు బాకీ పడున్నాం!" అన్నాడు సుబ్బరామయ్య.

"రాక రాక వచ్చేరాయె. అందునా పెద్దలు!ఏవనుకుంటారో ఏవిటో!" అని బాధ పడుతోంది సుందరమ్మ.

నాకు చాలా బాధ కలిగింది. వెంటనే వాణ్ణి పిల్చి, "చూడొరే సుబ్బులూ! వేళగాని వేళ! కూరలూ నారలూ అంటూ హైరానా పడకు. నాలుగు పచ్చడి మెతుకులు కడుపులో పడితే చాలు! మేమేదో ఆకాశంనుంచి ఊడిపడ్డట్లు చూడకండి!" అన్నాను భుజం తడుతూ! వాడి మొహం వెలిగి పోయింది.

ఎలా అయితేనేం, భోజనాలు ముగించేం.

"అబ్బ! ఎన్నాళ్ళయిందిరా, కల్తీ లేని నెయ్యితో, ఇంత రుచిగా వున్న ఆవకాయతో అన్నం తిని! అచ్చమైన తెలుగింటి ఆదరాన్ని, భోజనాన్ని, నూరు పైసల తెలుగుదనాన్ని ఎన్నేళ్ళకో రుచి చూసేన్రా సుబ్బులూ!" అన్నాడు కనకారావు.

"ధన్యుణ్ణిరా కనకా! మీ రెక్కడ బాధ పడతారో అని బెంగపడిపోయేను. డబ్బు సర్దుబాటు కాక ఈ ఏడాది ఊరగాయలు పెట్టొద్దనుకున్నాను. కాని నాలాంటి మధ్య తరగతివాడి బతుకు గురించి మీకు తెలీని దేవుంది? నెలలో ఎక్కువ రోజులు జేబులు ఖాళీయేగా! కూరా నారా తెచ్చుకుని విందు భోజనాలు చేసే అవకాశాలు తక్కువరా! అటువంటి రోజుల్లో నాలుగు ముద్దలు రుచిగా నోటికి వెళ్ళేలా చేసేది ఈ ఊరగాయే! అందుకే ఆలోచించి, అప్పు చేసి మరి పెట్టించేన్రా! అలా చేసుండకపోతే ఈ రోజు మీ యిద్దరూ ఇలా హఠాత్తుగా వచ్చినందుకు – ఆది వేళగాని వేళలో – నా పరువు నట్టేట్లో కలిసిపోయేది. వెండి చెంచా నోట్లో పెట్టుకు పుట్టిన రచయితెవరో, ఆవకాయ ఆంధ్రుల ఆడంబరానికి – అందునా త్రిశంకు సంతతిగా పేరు పడ్డ మధ్య తరగతి వారి ఆడంబరానికి చిహ్నం అంటూ రాసిన కథని ఆమధ్య ఎప్పుడో చదివి నవ్వుకున్నాను. ఆ కథ ఏ రకమైన సామాజిక స్పృహని ప్రతిబింబిస్తోందో ఇప్పటికీ నా కర్థం గాక, ఆ రచయిత ఒంటిమీద స్పృహ లేని స్థితిలో రాసేడేమో అనుకున్నాను" అన్నాడు సుబ్బరామయ్య.

నేను తల తిప్పి కనకారావుని చూసేను. వాడు గుడ్లప్పగించి శూన్యంలోకి చూస్తున్నాడు. నాకు అర్థమైంది. కలం పేరుతో కథ పంపిన మా కనకారావుకి స్పృహ తప్పింది. □

